# ఋణం

అవధాని బాధగా మూలిగి పక్కకి వొత్తిగిలి పడుకున్నాడు. అతని వొళ్ళు సలసల కాగిపోతోంది. శరీరమంతా సూదులతో పొడుస్తున్నట్టు చుర చుర లాడుతోంది. తలలో సమ్మెటపోట్లు. ఎటు తిరిగి పడుకున్నా సుఖం లేకుండా వుంది.

నలభై పైబడిన అవధాని ఎప్పుడూ రెండు లంఘనాలు చేసి ఎరుగడు. అతనికి రొంప పట్టడం కూడ చాలా అరుదు. అతను కష్టపడి పని చేస్తాడు. వందమందికి ఒక్క చేతిమీదుగా వంటచేసి వడ్డన చెయ్యగలడు. ఊళ్ళోవున్న పెద్ద పెద్దవాళ్ళ యిళ్ళల్లో ఏ శుభకార్యం జరిగినా మరే అవసరం వచ్చినా అవధాని అన్నీ క్షణాలమీద జరిగేలా చూస్తాడు. అందరికీ తలలో నాలుకలా వుంటాడు. అయినా అతని బ్రతుకు గొర్రెతోక లాంటిది. దానికి ఎదుగూ బొదుగూ వుండదు. రెక్కాడితేగాని డొక్కాడదు. ఉపద్రవంలా వచ్చి పడిన ఈ జ్వరంచూసి అవధాని భయపడ్డాడు. ఎందుకిలా వచ్చింది? తను మంచానపడితే యిల్లు గడిచేది ఎలాగా అని బాధపడడం మొదలుపెట్టాడు.

“నాన్నా! ఒక్కసారి యిటుచూడు” అంటూ అతని కూతురు లలిత అవధాని వంటిమీద చెయ్యివేసి “అమ్మో! ఎంత జ్వరమో” అంటూ కంగారుపడింది. వెంటనే తమ్ముడిని పిలిచి “ఒరే రామూ, నూతి పళ్ళెం దగ్గర వాటాలో ఆచారిగారు వుంటారే - ఆయన్నే పిలుచుకురా - నాన్నకి

చాలా జ్వరం వుందని చెప్పు. ఏం ?" అంటూ పంపింది. రాము పరుగు తీశాడు.

అవధాని వుండే ఆ యింట్లో సుమారు పన్నెండు వాటాలు వున్నాయి. అన్నీ రెండుగదుల వాటాలే. అంతా కలిసి ఒక్కటే ఉమ్మడి వాకిలి. ఉమ్మడి నుయ్యి-అన్ని సౌకర్యాలూ వుమ్మడే. మొత్తం అక్కడున్న అన్ని సంసారాల్లోనూ నూటయాభై రూపాయలు పైన రాబడి వున్నవాళ్ళు ఒక్కరూ లేరు. అందరూ కష్టపడి పనిచేసుకుని గౌరవంగా బ్రతుకులు యీడ్చుకుపోతున్నారు. అవధానికి పదహారేళ్ళ కూతురు-లలిత, పదేళ్ళకొడుకు రాము. అవధానికి పూర్వాచారాలు, సనాతనభావాలు నరనరాల్లోనూ జీర్ణించుకుపోవడంతో లలితను చదువుకోడానికి ససేమిరా బయటకి పంపలేదు. ఏదో ఆ పిల్ల వుత్సాహం కొద్దీ కొంచెం చదవడం వ్రాయడం నేర్చుకుంది. దొరికిన పుస్తకం చదవకుండా వదలదు. అర్థమైనా, కాకపోయినా చదివి మాత్రం అవతల పారేస్తుంది.

అవధాని యిటూ అటూ కదులుతున్నాడు. లలిత భయంగా, ఆందోళనగా తమ్ముడికోసం గుమ్మంవైపు చూస్తోంది.

భాస్కరం యీలవేస్తూ యింటి తాళం తీస్తూ ఒక్కసారిగా ఆగిపోయాడు. పక్క వాటాలోంచి మూలుగు గట్టిగా వినిపిస్తోంది. అతను గది తలుపులుతీసి చీకట్లో అగ్గిపుల్ల గీశాడు. పేదవారి బ్రతుకుల్లో పేరుకుపోయిన చీకటిలో మిణుగురు పురుగులా అది వెలిగింది. కిటికీలో వున్న లాంతరు వెలిగించి బట్టలు మార్చుకున్నాడు. మసిబారి నల్లగావున్న లాంతరు చిమ్నీలోంచి వెలుగు నలుపు-తెలుపు కలిపి నేసిన కలనేత బట్టలా గదంతా పరచుకొంది.

భాస్కరానికి, అవధానికీ వయసులో చాలా తేడా వున్నప్పటికీ ఇద్దరూ మంచి స్నేహంగా వుంటారు. భాస్కరం ఒక గవర్నమెంటు

ఆఫీసులో ప్యూనుగా పనిచేస్తున్నాడు. బ్రాహ్మణ కులంలో పుట్టి అలాంటి వుద్యోగానికి వెళ్ళడం చాలా నామర్దా అని ఎన్నోసార్లు అవధాని అతనితో అనేవాడు. దానికి భాస్కరం సమర్థించుకుంటూ వాదించేవాడు. కష్టపడి ఎక్కడో ఒకచోట నీతిగా పనిచేయడంలో తప్పులేదని, తన దురదృష్టం కొద్దీ చిన్నప్పటినుంచీ తనకి చదువు వంటబట్టలేదని, తన వుద్యోగం కూడ చాలా గౌరవప్రదమైనదేనని చెప్పి, అవధానిని వొప్పించాలని చూసే వాడు భాస్కరం. కరుకుల్లా వచ్చే నూటయాభై రూపాయలమీద అవధానికి ఆశవున్నా గౌరవం కలిగేదికాదు. ఏదో మూర్ఖంగా వాదించేవాడు. అభిప్రాయాలు ఎలావున్నా యిద్దరూ అన్నీ మరిచి మంచి స్నేహితుల్లా మెలిగేవారు. అవధానికి అయిదూ, పదీ కావలసివస్తే భాస్కరం సర్దేవాడు. చిన్నవాడు, అన్నీ తెలియవు అని అతని భారం తనమీద వేసుకుని, మంచి, చెడ్డ చూస్తూ యిరుగు పొరుగు అందరితో తన మనిషిగా చెప్పేవాడు అవధాని. భాస్కరం వంటకి బద్ధకించి కూర్చుంటే తనింట్లోంచి భోజనం పంపేవాడు-భాస్కరం తెచ్చిన పత్రికలు, పుస్తకాలు తండ్రి యిస్తే లలిత చదువుతూ వుండేది. లలిత ఎప్పుడు భాస్కరంతో మాట్లాడి ఎరుగదు.

ఓర వాకిలిగా వేసివున్న తలుపు మెల్లగా తోశాడు భాస్కరం. అది కిర్రుమంది. "ఎవరూ" అంటూ లలిత చాపమీదలేచి కూర్చుంది.

"అవధానిగారు ..." అంటూ యింకా ఏదో అనబోయాడు భాస్కరం.

"నాన్నగారికి వంట్లో బాగుండలేదు" అంటూ లేచి లాంతరు పెద్దది చేసి, పక్కగదిలోకి నడిచింది.

"ఎప్పటినుంచి జ్వరం?" అంటూ అవధాని మంచం దగ్గరికి జేరి భాస్కరం వులిక్కిపడ్డాడు. అతను భయంతో కంపించి పోయాడు. శరీరం మీద రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఒక్కసారి చలి గుండెల్లోంచి

గజగజ లాడించింది. అవధాని అస్తవ్యస్తంగా నులకమంచంమీద పడి వున్నాడు. చిన్న అంగవస్త్రం తప్ప వంటిమీద బట్టలేదు. వంటినిండా కుంకుడుగింజలు పేర్చినట్లు బొబ్బలు వున్నాయి. విషయం అర్థమైంది. ఒక్క అడుగు వెనక్కివేశాడు భాస్కరం.

మశూచి - భయంకరమైన మశూచి.

"పెద్దమ్మవారు, చల్లనితల్లి దయగా చూస్తే ఏమీ ఫరవాలేదన్నారు అంతా" అంది లలిత సన్నగా.

అవధాని నిద్రపోతూనే వున్నాడు. ఎందుకో అక్కడ ఒక్కక్షణం కూడా నిలబడలేకపోయాడు భాస్కరం.

"ఏమైనా కావలంటే అడగండి" అని బయటకి వచ్చేశాడు.

అతని మనసులో పెద్ద తుపాను చెలరేగింది. అంతవరకు యింట్లో అలాంటి మనిషిని పెట్టుకుని చుట్టుపక్కలవాళ్ళు ఎలా వుండాలి అనే అతను మధనపడసాగాడు. ఇది ఎంతమందిని చుట్టపెట్టుకుని పోతుందో అని ఆలో చించినకొద్దీ అతనికి మరీ గందరగోళంగా అనిపించి భయంవేసింది. ఏమీ చెయ్యబుద్ధి పుట్టలేదు. కళ్ళుమూసినా తెరిచినా ఒకటే దృశ్యం అతన్ని వెంటాడుతోంది. అస్తవ్యస్తంగా పడివున్న అవధాని రూపం అతని మనసులో నిలిచిపోయింది. రాత్రంతా నిద్రలేకుండానే గడచిపోయింది.

బాగా ఎండ ముదరకముందే భాస్కరం యింట్లోంచి బయటపడ్డాడు. అతను రోడ్డుమీద నడుస్తుంటే కూడా అదే ఆలోచన. ఏం చేయాలి ? అది భయంకరమైన వ్యాధి. నీటిద్వారా, గాలిద్వారా సులువుగా వ్యాపించి పోతుంది. మొత్తం ఆ లోగిలిలో యాభైమందికి పైనేవున్నారు. అందరినీ ఎలా రక్షించడం ? అందరూ మూర్ఖులే. మూఢవిశ్వాసాలేగాని ఆలోచన లేనివారు, చెప్పినా వినరు. కాని యిప్పుడు వినకపోయినా చెప్పకతప్పదు. సంఘ సంక్షేమం అంటారేగాని, ఈ సంఘంలో ఎవరేనా యిలాంటి

పరిస్థితిని ఎదుర్కొని నిలబడగలరా అని ఎంతో బాధపడిపోయాడు భాస్కరం. సాహసంతో అతను ఒక నిశ్చయానికి వచ్చాడు. ముందుకు పడే ప్రతి అడుగు సందిగ్ధంగా వెనక్కి లాగుతున్నా ధైర్యంగా ముందుకే నడిచాడు. నిర్మూలించాల్సిన సమస్య అతని ముందు నిలిచి తొందర చేసింది.

భాస్కరాన్ని ఎంతో మెచ్చుకుని చాలా పొగిడాడు మెడికల్ ఆఫీసరు. మీలాంటి యువకులు మాకు సహకరించాలి అంటూ భుజంతట్టాడు. ఒక అరగంటలో పూర్తి వివరాలు-భాస్కరం ఆఫీసు అడ్రసు, తీసుకుని అతన్ని పంపేశారు ఆరోగ్యశాఖవారు.

కనుచీకటి పడేవేళ భాస్కరం కాళ్ళీడ్చుకుంటూ యింటికి వచ్చాడు. లలిత గుమ్మంలో తలొంచుకుని కూర్చునివుంది. బాగా ఏడ్చినట్లు కళ్ళువాచి వున్నాయి. భాస్కరానికి అడుగు ముందుకు వెయ్యడానికి గుండెలు దడదడ లాడాయి. అతని అడుగుల సవ్వడికి లలిత చటుక్కున తలెత్తింది. పగ పట్టిన త్రాచుపామును చూసినట్లు ఆమె భయపడింది. ఆమె కళ్ళు కోపాగ్నితో భగభగమండాయి. భాస్కరం తప్పు చేసిన వాడిలా తలదించుకున్నాడు. ఆమె ఒక్క ఉదుటున లేచి లోపలికి వెళ్ళి దభీమని తలుపేసుకుంది. భాస్కరానికి ఛెళ్ళున కొట్టినట్టు అనిపించింది అతను తేరుకుని అడుగు ముందుకేశాడు. ఇంతలో పెద్దబొజ్జ వూపుకుంటూ వైశంపాయనుడు గారు వచ్చి భాస్కరానికి అడ్డుగానిల్చి వ్యంగ్యంగా నవ్వుతూ "ఏమిటోయ్ చాలా పెద్దవాడివై పోయినట్టున్నావ్!" అన్నాడు.

ఇంతలో మరో పెద్దమనిషి ముందుకు దూసుకొచ్చాడు.

"ఏవయ్యా ! కుర్రాడివైనా బుద్ధిమంతుడివి అనుకున్నాం. ఇదేనటయ్యా నీ చదువు? బాగుంది. పెద్దముండావాడు; ఏదో తల్లి కనిపించింది. ఆ తల్లే చల్లగా జారిపోతుంది. దానికి మందులూ మాకులూవేస్తే కోపగించి

కొంపతీస్తుంది. ముష్టి డబ్బుకోసం ఆశపడి గవర్నమెంటువారికి చెప్తావా? ఛీ"—అంటూ దులిపేశాడు.

మరో సన్నటి మనిషి సిగరెట్ కాలుస్తూ లుంగీ ఎగ్గట్టి, "ఈ కాలం పిల్లలకి తెలివి ఎక్కువండి. రకరకాల సంపాదనలు, మంచీ - చెడ్డా, నీతి నియమం ఏమీలేవు" అంటూ సాగదీశాడు.

లలిత కొంచెం తలుపుతీసి సందులోంచి చూస్తోంది. పక్కింటి పిన్నిగారు గబగబా వచ్చింది.

"నలుగురి మధ్యా బ్రతకాలంటే యిలాగేనా వుండేది? ఏం బాబూ, ఎదుటివారి కష్టం అర్థంచేసుకోవాలి. తోటివారి మంచి కోరాలి. నలుగురు క్షేమంగా వుండాలని కోరుకోవాలి. అంతేగాని, తగుదునమ్మా అంటూ ఇదా చేసేపని" అంటూ సన్నాయి నొక్కులు నొక్కింది.

ఇంతవరకు నోరుపడిపోయిన వాడిలా నిలబడిన భాస్కరంలో ఒక్కసారి చైతన్యం వచ్చింది.

ఒక్కమాటే జవాబు చెప్పాడు "నలుగురి మంచికోరే నేనాపని చేశాను" అని.

"బాల్లే! అలా అనకపోతే డబ్బుకోసం అంటావేమిటి?"

"సార్! మీ రిష్టం వచ్చినట్లు మాట్లాడకండి. నా కసలు డబ్బు యిస్తారని కూడా తెలియదు."

"భేష్! బాగుందోయ్. అబద్ధం ఆడినా గోడ కట్టినట్లు వుండాలి. ఎక్కడ చూసినా, ఏ గోడమీద చూసినా గవర్నమెంటువారు ఘోషిస్తున్నారుకదా మొట్టమొదటగా తెలియజేసినవారికి వెయ్యిరూపాయలు బహుమతి అని."

భాస్కరం మనసు బాధతో కుతకుతలాడింది. నిజంగా తనెప్పుడూ ఆ విషయం చూడలేదు. ఇలాంటి పరిస్థితిలో వారికీవిషయం తెలియజెయ్య

డమే తన కర్తవ్యంగా అనుకున్నాడుగాని ఈ బహుమతులు అవీ తనకు తెలీనే తెలీదు. కాని యిప్పుడెవరు నమ్ముతారు? అవధాని వాటాకేసి చూశాడు. లలిత యిటే చూస్తోంది. ఆ రెండు కళ్ళనిండా అసహ్యం నిండి వుంది. భాస్కరానికి గుండెలు ఎవరో గట్టిగా పిండినట్లుగా అనిపించింది. అతను మొదటిసారిగా తప్పు చేశానేమోనని బాధపడ్డాడు. భాస్కరాన్ని యిలా వీధిలో నిలేసి అంతా గొడవ చేస్తుంటే నూతి పళ్ళెం దగ్గర వాటాలో వుండే ఆచారిగారు నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చారు

"ఏమిటిదంతా? ఏదో చిన్న కుర్రాడు. తెలీక చేశాడు. సంఘ సంక్షేమం అంటూ గవర్నమెంటు ప్రాపగాండా చేస్తుంటే చిన్నవాడు కదా! సరే, యిక వదిలేయండి" అంటూ అటూ ఇటూ కాకుండా సర్దిచెప్పేశారు. నిజానికి ఆచారిగారికి భాస్కరం చేసిన దానిలో పెద్ద తప్పేమీ కనిపించ లేదు. సరికదా, అది ఒక విధంగా మంచిదే అనిపించింది. ఆయన కూడా విశాలంగా ఆలోచించలేకపోయినా యీ మధ్య నలుగురికి మందులివ్వడం, రోగాల గురించి పరిశీలించడం చేస్తున్నారు. అందువల్ల యిలాంటి దారుణ మైన పరిస్థితిలో మనిషిని విడిగా ఎక్కడైనా వుంచి వైద్యం, సదుపాయం చూడటం మంచిదే అని ఆయనకు కూడా అనిపించింది. కాని, ఆ విషయం నలుగురిలో గట్టిగా చెప్పి, భాస్కరాన్ని సమర్థించగల ధైర్యం ఆయనలో లేదు. అందుకే అటూ యిటూ కాకుండా సర్దిచెప్పారు.

చివరికి అంతా కలిసి ఒకటే నిర్ణయం చేశారు. భాస్కరంలాంటి పొరుగు కిట్టనిమనిషిని నలుగురు మసిలే యిలాంటి యింట్లో వుంచకూడదు అనుకున్నారు.

ఆడాళ్ళు నలుగురూ కలిసి ఇల్లుగలామె దగ్గరికి బయలుదేరివెళ్లారు. ఆమె చాలా ముసలిది. ఏదో ఒకమూల గదిలో వుండి, యింత వండుకు

తింటూ, ఇంటిమీద వచ్చే అద్దెలో కొంత వాడుకుని, మరికొంత ఎక్కడో దూరానవున్న కొడుకు పేర బ్యాంకులో వేస్తూ వుంటుంది.

అద్దెకున్నవాళ్ళంతా ఆమెకు వ్యవహారాలు చూసిపెడుతూ వుంటారు. ఆమె కూడా ఎవర్నీ ఏమీ అనదు. అతి భయస్థురాలు.

ఇంతమంది ఒక్కసారి తన దగ్గరికి రావడంతో ముసలామె కొంచెం గాభరాపడింది.

"బామ్మగారు చూశారా ! నలుగురూ కలిసివుంటే యీ యింట్లో కష్టం వస్తుంది, సుఖం వస్తుంది. యిలా బయట పెట్టుకుంటే ఎలాగండి?" అంది ఒకామె. బామ్మగారు ముందు తెల్లబోయినా విషయం వెంటనే అర్థం చేసుకుంది. కానీ ఆమె నోరు విప్పకుండానే "వెంటనే యిల్లు ఖాళీ చేయించండి. మందులూ, మాకులూ వేస్తే తల్లికి కోపం వస్తుంది. అంటురోగం అంటే ఎంత తప్పు? అది అసలు రోగమే కాదు !" అంటూ అందుకుంది మరొకామె. బామ్మగారు ఏమీ చెయ్యలేకపోయింది.

భాస్కరం గది ఖాళీచేశాడు. లలిత తన దగ్గరవున్న పాత పత్రికలు తిరిగి యిచ్చేసింది.

"మీ నాన్నగారు పూర్తిగా కోలుకుని ఇంటికివస్తారు. అప్పటికైనా మీకు నా గురించి అర్థమైతే చాలు" అన్నాడు భాస్కరం.

ఆమె ఒక్కసారి అతనికేసి చూసి తలదించుకుంది. తండ్రి ఎలాగూ లేడు. యెంతో స్నేహంగా వున్న భాస్కరం కూడ వెళ్ళిపోవడం ఆమెకి కొంచెం బాధగానే అనిపించింది. అందరూ కలిసి అతన్ని అనరాని మాటలని వెళ్ళగొట్టడం లలితకి కష్టం అనిపించింది. అయినా తను పెదవివిప్పి మాట్లాడలేకపోయింది. ఎందుకంటే అతను తమకి తీరని ద్రోహంచేశాడు. అతనిమీద తను జాలి తలచడంలో అర్థంలేదు. తన కన్నతండ్రి ఎంతో బాధలో వుండగా కనీసం తను దగ్గరగా వుండే అవకాశం కూడా లేకుండా చేశాడు.

లలిత ఆలోచిస్తూ కూర్చుంది. భాస్కరం యిలా చెయ్యడానికి కారణం ఏమిటో ఆమెకి ఎంత ఆలోచించినా బోధపడకుండా వుంది. అత నెలాంటివాడో తనకి తెలీదు. ఇంతకాలంగా చూస్తున్నా అతను మంచిగానే, మర్యాదగానే వుండేవాడు. వెకిలి వేషాలు వేసేవాడు కాదు. తన తండ్రిని ఎక్కడో అంటురోగుల ఆస్పత్రిలో చేర్పిస్తే తనూ తమ్ముడు ఏమైపోవా లని అతడి ఉద్దేశం? ఆ మాత్రం ఆలోచించలేకపోయాడా భాస్కరం అను కుంది. మళ్ళీ ఆమెమనసు ఎదురుతిరిగి ఆలోచిస్తోంది. ఒకవేళ నాన్న అలా బాధపడుతూ యీ యిరుకుకొంపలో వుంటే తనేం చెయ్యగలదు? తనకి తోడుగా ఎవరుంటారు? ఈ కబుర్లు చెప్పే వారెవరైనా తనకి సహాయం చేస్తారా? ఇది మనిషినుండి మనిషికి పాకిపోయే అంటురోగం అంటారు. నిజంగా భాస్కరం చేసినపని మంచిదేనేమో! వెంటనే అంటురోగం అన్నం దుకు లెంపలేసుకుంది. భయంగా అమ్మవారికి దండంపెట్టుకుంది - ఏది ఏమైనా అతని ముఖం చూస్తే దగా, మోసం కనిపించడంలేదు అనుకుంది.

లలితకి ఏమీ తోచలేదు. మనసు అటూ ఇటూ వూగిసలాడుతోంది. బెంగగా అనిపిస్తోంది. రామూ అస్తమానూ తండ్రిని గురించే అడుగు తున్నాడు.

పదిరోజులు గడచిపోయాయి.

ఈ పదిరోజుల్లో భాస్కరం వచ్చి అవధాని కులాసాగా ఉన్నాడని, యింకా పూర్తిగా తగ్గలేదని, కంగారు పడాల్సిన పనిలేదని చెప్పాడు. లలితమాత్రం అతన్ని గుమ్మంలో నిలబెట్టి మాట్లాడి పంపేసింది. అయినా ఇరుగు పొరుగువాళ్ళు నాలుగు రకాలుగా సలహా లిచ్చారు. లలితకి ఒళ్ళు మండింది.

"ఏమ్మా లలితా! వాడెందుకు వచ్చాడు. చేసింది చాలక ? నువ్వు మాత్రం మాట్లాడకు. మాయలాడి వెధవ" అంటూ ఒకరు

"అయినా తండ్రి లేడుకదా వాడికేం పని నీతో" అని మరొకరు

"ముఖంమీద తలుపేసి లోపలికెళ్ళక వాడితో నీకు మాటలేమి టమ్మాయ్" అంటూ ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు అనేశారు. లలితకి చాలా కష్టంవేసింది. ఎప్పుడూ మనిషిని తప్పుగానేకాక మంచిగా అంచనా వెయ్యడం ఈ మనుష్యులకి తెలియదా? నిజానికి ఎంతో బెంగగావున్న సమయంలో భాస్కరం వచ్చి చల్లనిమాట చెప్పి వెళ్ళడంవల్ల తన మనసుకి ఎంత వూరట కలిగిందో వీళ్ళకెలా తెలుస్తుంది?

లలితకి చుట్టుప్రక్కల వాళ్ళంటే భయం, అసహ్యం వేసింది. మనుషులు పక్కవారిని పీలుంటే పీక్కుతింటారు. లేకుంటే హేళన చేస్తారు. వీళ్ళని అసలు పట్టించుకోకూడదు. ఈసారి అతను వస్తే కూర్చో బెట్టి మాట్లాడాలి అనుకుంది లలిత.

* * *

భాస్కరం రెండుసార్లు అవధాని యింటికివెళ్ళి పిల్లల్ని చూసి వచ్చాడు. అతని మనసు పరిపరివిధాల ఆలోచిస్తోంది. నిజంగా ఆ సంసారం తనవల్ల దిక్కులేనిదిగా కాకూడదు అనుకున్నాడు. అవధాని మళ్ళీ ఇంటికి వచ్చేవరకు వాళ్ళ బాగోగులు తనే చూడాలని నిర్ణయించుకున్నాడు. మిత్రుల ద్వారా అవధాని వుండే హాస్పిటల్‌లో అతని క్షేమం తెలుసుకున్నాడు ఒక రిద్దరు పెద్దవాళ్ళని కలుసుకుని అతని విషయం వివరించి అతన్ని జాగ్రత్తగా చూసే ఏర్పాటు చేసాడు.

ఆరోజు సాయంత్రం అతను అవధాని ఇంటికివెళ్తే లలిత ఆప్యాయంగా ఆహ్వానించింది. ముందు అతను కాస్త తత్తరపడ్డాడు. తనుతెచ్చిన డబ్బు లలితకిస్తూ "ఈ డబ్బు మీ ఖర్చుకండి" అన్నాడు. ఆమె కళ్ళల్లో మెదిలిన అనుమానం కనిపెట్టి మెల్లిగా నవ్వుతూ "అప్పుగానే లెండి. మీ నాన్నగారు వచ్చిన వెంటనే తీర్చేయవచ్చు" అన్నాడు.

లలిత కళ్ళల్లో చివ్వున నీరు చిమ్మింది. నిజానికి తెల్లారితే యింట్లో ఏమీలేవు. కబుర్లు చెప్పిన వారెవరూ సహాయానికి ముందుకురాలేదు. నూతి పళ్లెం ఆదారిగారి భార్య మాత్రం పిలిచి నాలుగుశేర్లు బియ్యం యిచ్చింది. అవే సర్దుతూ వచ్చింది యీనాటివరకు. లలిత డబ్బుతీసుకుంది. భాస్కరం లేదాడు వెళ్తానని. లలిత వుండమని, నిమ్మకాయ నీళ్ళు యిచ్చింది. అవి చల్లగా హాయిగా అనిపించాయి.

* * *

నెలరోజుల తరువాత అవధాని చిక్కి శల్యమై మెల్లగా రిక్షా దిగుతుంటే అంతా ఆశ్చర్యంతో గుమిగూడారు. లలిత పరుగున వెళ్ళి తండ్రికి చేయి ఆసరాయిచ్చి నడిపించింది. ఆమె కళ్ళల్లో నీటిపొరకమ్మింది. ముఖం నిండా మచ్చలతో పోలికే మారిపోయిన తండ్రిని భయంగా చూశాడు రాము.

"లలితా, భాస్కరం వచ్చాడా!" అన్న ప్రశ్నకి లలిత క్షణం తత్తరపడింది. వచ్చాడని చెప్పాలా, ఎప్పుడొచ్చాడని చెప్పాలి. తండ్రి ఏమంటాడోనని ఆమెకి భయంవేసింది. "మూడు రోజులక్రితం వచ్చారు" అంది. ఏది ఏమైనా తండ్రితో అబద్ధం ఆడకూడదని.

"నిజంగా అతనే లేకపోతే నేనేమై పోయేవాడినో !" అని తండ్రి అంటుంటే ఆమె మనసులోంచి భయం పొర తొలగి ఆనందం విరిసింది. అవధాని అక్కడ తనెన్నంత జాగ్రత్తగా చూశారో, వారి సేవాధర్మంవల్లనే తనెలా బ్రతికి బట్టకట్టాడో కూతురుతో చెప్తుండగా గుమ్మంలో భాస్కరం కనిపించారు.

"రావోయ్" అంటూ అతన్ని ఆహ్వానించాడు.

"మిమ్మల్ని ఈరోజు డిస్‌ఛార్జ్ చేస్తారని తెలుసు. ముందుగా అక్కడికే వద్దామని అనుకున్నాగాని అర్జంటుగా మా ఆఫీసరు యింటికి వెళ్ళాల్సి వచ్చింది.

"ఫరవాలేదు-అమ్మాయ్ కొంచెం కాఫీ కలుపమ్మా. అన్నట్టు పాలు వున్నాయా?" అన్నాడు మెల్లిగా.

"ఉన్నాయి నాన్నా" అంటూ లలిత లోపలికెళ్ళింది.

భాస్కరం జేబులోంచి మెల్లిగా కాగితాల మధ్యన వున్న వెయ్యి రూపాయల సొమ్ము తీసి అవధాని చేతిలో పెడుతూ-

"నేను డబ్బుకు ఆశపడి మీకేదో ద్రోహం చేశానని అందరూ అనుకున్నారుగాని నాకలాంటి దురుద్దేశం ఎప్పుడూలేదు. మిమ్మల్ని నిజంగా రక్షించాలనీ, యీ చుట్టుపక్కలవారిని యీ ఆపదనుండి తప్పించాలని ఇలా చేశాను. మిమ్మల్ని చాలా బాధపెట్టి వుంటాను - ఇదిగో - ఈ డబ్బు మీ మూలంగా వచ్చింది. మీకే చేరడం న్యాయం. మిమ్మల్నీ, మీ కుటుంబాన్నీ పెట్టిన కష్టానికి యీ విధంగానైనా ఋణం తీర్చుకుంటున్నా" అన్నాడు. కళ్ళలో నీరు నిండింది.

"బాబూ! నువ్వు మాకు ఋణపడి వుండటమేమిటి? నేనే నీ ఋణం తీర్చుకోలేను. ఈ డబ్బు నాకెందుకూ? నీకు నేనే మివ్వుకోగలనా అనే ఆలోచిస్తున్నాను" అంటూ అప్పుడే కాఫీగ్లాసుతో అక్కడికొచ్చిన లలిత కేసి చూసాడు. ఆమె కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి. చేతిలోగ్లాసు కొంచెం వణికింది.

"అతనికీయమ్మా" అన్న తండ్రి మాటతో ఆమె భాస్కరం కేసి చూసింది. ఒక్కక్షణం యిద్దరిచూపులూ కలుసుకున్నాయి. కాఫీ అతని చేతి కిచ్చి చటుక్కున ఆమె లోపలి కెళ్ళిపోయింది.